క్లుప్తంగా

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ వార్డు పరిపాలనా కార్యదర్శులకు, వలంటీర్లకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం నగరపాలక సంస్థ 3, 4 డివిజన్లకు చెందిన 6, 7, 8 సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసి జగనన్న సురక్ష సర్వే ప్రగతిని ఆరా తీశారు. జులై ఒకటి నుంచి జరుగనున్న జగనన్న సురక్ష క్యాంపులకు సంబంధించిన అన్ని వసతులను సంబంధించిన శాఖలను సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముందుగానే అన్ని ఇళ్లను సర్వే చేసి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు రుసుం చెల్లించనవసరం లేదని వలంటీర్లు తమ క్లస్టరులో ప్రతి యింటిని సర్వే చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఒక సెంట్రల్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

ఇంటింటా ఇంటర్నెట్ ఏపీ ఫైబర్‌తోనే సాధ్యం

సీటీఆర్ఐ: ఇంటింటికీ ఇంటర్నెట్ ఏపీ ఫైబర్ తోనే సాధ్యమని ఏపీ ఫైబర్ రాజమహేంద్రవరం ఎంఎస్ఓ కె.రాకేష్‌బాబు అన్నారు. శనివారం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎస్ఎఫ్ఎల్ సంస్థ ద్వారా ట్రిపుల్ ప్లే సర్వీసులకు సంబంధించి సెట్‌టాప్ బాక్స్‌లు కోసం నాలుగు కంపెనీలతో అనుసంధానమైందన్నారు. ఆయా కంపెనీలు తమ ధరలను రూ.4వేల నుంచి రూ.4,500 వరకు నిర్ణయించామన్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అధిక ధరలతో సెటటాప్ బాక్స్‌లు కొనే పరిస్థితులలో వినియోగదారుల్లేరన్నారు. సెటటాప్ బాక్స్‌లను ఉచితంగా అందించాలని ఆపరేటర్‌లు, వినియోగదారులు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల నవరత్నాలలో భాగంగా ప్రభుత్వ పథకాలన్నింటిని ప్రజల వద్దకు నేరుగా తెలియచేయడానికి, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్‌ను ముందుకు తీసుకుని వెళ్లడానికి వీలు కలుగుతుందన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



విద్యార్థి అనూషను సత్కరిస్తున్న ఆర్జేడీ శారద

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతమిస్తూ విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పిస్తోందని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఇ.శారద అన్నారు. ఆణిముత్యాల పథకంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష రూపాయల నగదు, బంగారు పతకం అందుకున్న ఇంటర్ విద్యార్థిని మాగాపు అనూషను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. దీనికి ఆర్జేడీ శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆణిముత్యాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ విద్యార్థి మాగాపు అనూష ఎంపికవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థినికి పాఠాలు బోధించిన అధ్యాపకులను కళాశాల తరుపున దుశ్శాలువ తో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్‌బోర్డు ఆర్ఐవో ఎస్ఎస్‌వీఎల్ నర్సింహం, డీవీఈఓ కావ్య సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 11 మంది ఎంపిక

ప్రకాశం నగర్: వికాస ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 11 మంది అభ్యర్థులు ఎంపికైనట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో రివర్‌బేకు పది మంది, డిక్సన్‌కు ఒక్కరు ఎంపికయ్యారని చెప్పారు. వికాస మేనేజర్ సత్యనారాయణ ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులతో పోస్టులు భర్తీ చేయండి

కంబాలచెరువు: ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి కొత్తగా మంజూరు చేసిన ఉప విద్యాశాఖాధికారి పోస్టు, ఎంఈఓ–1 పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులతోనే నియామకం చేపట్టాలని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్‌రామ్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ఎంపీ భరత్ సానుకూలంగా స్పందించారని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మణికుమార్ కరీమ్, సుబ్బారావు, పాండురంగారావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సూపర్

- నిత్యం 800 వరకూ ఓపీ నమోదు
- ప్రభుత్వాసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవలు
- శరవేగంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు



బోధనాసుపత్రి

కంబాలచెరువు: ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోంది. ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలనే ధృడసంకల్పంతో వైద్య రంగంలో పలు మార్పులను తీసుకొస్తోంది. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో వైద్య తరగతులు ప్రారంభంకానున్నాయి. దీనికి అనుసంధానంగా బోధనాసుపత్రి తయారవుతోంది. దీనిలో భాగంగా సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలను నిత్యం అందిస్తోంది. ప్రైవేట్ వైద్యుల భాగస్వామ్యంతో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏపీ వైద్య విధాన పరిషత్‌లో ఉన్న సమయంలో కలెక్టర్ చొరవతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భాగస్వామ్యంతో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభించారు. ఇప్పుడు జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏపీవీవీపీ నుంచి డీఎంఈలోకి మారింది. దీంతో బోధనాసుపత్రికి దాదాపు అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు వస్తున్నాయి. బోధనాసుపత్రిలో నిత్యం 600 నుంచి 800 మధ్య రోగులు ఉంటారు. ఆసుపత్రిలో 450 బెడ్స్ అందుబాటులో ఉండగా అవి నిత్యం నిండుకుని ఉంటాయి. ఎమర్జెన్సీ కేసులు గతంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపేవారు. మెడికల్ కళాశాల రాకతో అన్ని రకాల అత్యవసర సేవలు ఇక్కడే అందుబాటులోకి వస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభించి ఏడాది పూర్తయింది. ఇప్పటివరకూ మొత్తం ఆయా విభాగాల్లో 5,221 మందికి ప్రైవేట్ వైద్యుల ద్వారా వైద్య సేవలందించారు.

వైద్య సేవలు లభించే రోజు

సోమవారం	న్యూరాలజీ, రేడియేషన్ ఆంకాలజీ
మంగళవారం	సర్జికల్ ఆంకాలజీ
బుధవారం	కార్డియాలజీ, న్యూరో సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ
గురువారం	న్యూరో ఆంకాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, నెఫ్రాలజీ
శుక్రవారం	న్యూరాలజీ, కార్డియాలజీ, ఎండోక్రినాలజీ
శనివారం	న్యూరాలజీ, పిడియాట్రిక్ సర్జరీ

నిత్యం 600 పైనే ఓపీ



ప్రభుత్వాసుపత్రిలో 450 బెడ్స్ అందుబాటులో ఉండగా మరిన్ని అదనపు బెడ్లు వాడుతున్నాం. నిత్యం 600 మంది పైనే ఓపీ నమోదువుతోంది. అందిరికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నాం. మా సేవలతో పాటు ప్రైవేట్ వైద్యులతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందిస్తున్నాం. అత్యధికంగా ఇప్పటి వరకు కార్డియాలజీ విభాగంలో 1,392 మంది వినియోగించుకోగా, న్యూరో సేవలను 1,715 మంది వినియోగించుకున్నారు. బోధనాసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల సదుపాయాలు అందిస్తున్నాం.

– డాక్టర్ ప్రణవ్, డిప్యూటీ సూపరింటెండెంట్, బోధనాసుపత్రి

నిరంతర సేవలు



పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందిస్తున్నాం. ఈ సేవలు నిరంతరం కొనసాగుతాయి. దీనికి బోధనాసుపత్రి వైద్యాధికారులు, వైద్యుల సహకారం అందిస్తున్నారు. ప్రజలు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను వినియోగించుకుంటున్నారు. హార్మోన్స్‌కు సంబంధించి థైరాయిడ్, షుగర్ వంటి వ్యాధులకు ఎండోక్రినాలజీ విభాగం వైద్య సేవలు దాదాపు చాలా మందికి అవసరం. వాటిని అందిస్తున్నాం. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ గురుప్రసాద్, ఐఎంఏ నగరశాఖ అధ్యక్షుడు

'ఫిట్నెస్ ఫార్చ్యూన్' పుస్తకావిష్కరణ

ప్రకాశం నగర్: ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కోసం భాష్యం విద్యా సంస్థలు రూపొందించిన ఫిట్నెస్ ఫార్చ్యూన్ పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక టి.నగర్‌లోని భాష్యం హైస్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి యండమూరి వైష్ణవి సూర్య, టెన్నిస్ కోచ్ వీటీవీ సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు సాధన, తులసి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర కేజీ వెండి చోరీ

ధవళేశ్వరం: రాజవోలు రామాలయం వీధికి చెందిన పుల్లేటికుర్తి సూర్యప్రకాష్‌రావు ఇంట్లో గుర్తు తెలియని దుండగులు అర కేజీ వెండి, రూ.3 వేల నగదును చోరీ చేశారు. సంఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యప్రకాష్‌రావుకు తన ఇంటి ఆవరణలోనే ఒక గదిలో బంగారం, వెండి తయారుచేసే షాపు ఉంది. శుక్రవారం రాత్రి 9 గంటలకు షాపు మూసివేసి శనివారం ఉదయం తెరవగా షాపులోని ఇనుప బీరువా తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా అరకేజీ వెండి, రూ.3 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సూర్యప్రకాష్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కె.మంగాదేవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పందన ఎడ్యుకేషన్ అండ్ ఎంకరేజ్‌మెంట్ డీడ్ (సీడ్) కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నూరి సతీష్‌బాబు పాల్గొని విద్యా, భావోద్వేగ, ఆర్థిక నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న దక్షిణామూర్తి



వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న దక్షిణామూర్తి

కడియం: విద్యుత్ షాక్‌తో చేతి వేళ్లను కోల్పోవడంతోపాటు, శరీరంపై వివిధ చోట్ల 8 సర్జరీలు చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న చెరుకూరి దక్షిణామూర్తిది కడియం మండలం జేగురుపాడు గ్రామం. ఇటీవల సీఎం వైఎస్ జగన్ కొవ్వూరు వచ్చినప్పుడు ఆయనను కలిసి తన బాధలను వివరించారు. దీంతో దక్షిణామూర్తికి రూ.5.41లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేసి, చెక్కును అందజేశారు. ఈ నేపథ్యంలో దక్షిణా మూర్తి శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌లను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో సతమతమవుతున్న తనను సీఎం జగన్ ఆదుకున్నారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా దక్షిణామూర్తి ఉద్వేగానికి గురయ్యారు. ఆయన్ను సముదాయించిన నేతలు ప్రతి పేదవాడికి సీఎం వైఎస్ జగన్ అండ ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నారని వివరించారు. తన సమస్యను వివరించిన వెంటనే స్పందించిన పార్టీ నాయకులు జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులకు ఈ సందర్భంగా దక్షిణామూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్షలో సీసీఆర్సీ కార్డుల సర్వే

- అధికారులకు స్పష్టం చేసిన జేసీ తేజ్‌భరత్
- జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్, డీసీసీబీ చైర్మన్ వీర్రాజు, వ్యవసాయ మండలి చైర్మన్ సుబ్బారావు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న సురక్ష కార్యక్రమంలో సీసీఆర్సీ కార్డులను ఇంటింటి సర్వే సమయంలో నమోదు చేసి గ్రామ సభలో అందించడం జరుగుతుందని జేసీ తేజ్‌భరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ఖరీఫ్ సాగు, నీటి సరఫరా, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ఈ కేవైసీ, పశు సంవర్థక, ఉద్యానవన ఫామాయిల్, కోకో పంటలు సాగు విస్తీర్ణం పెంచే దిశలో చేపడుతున్న పథకాలపై జలవనరుల శాఖ, మైక్రో ఇరిగేషన్ తదితర అనుబంధ శాఖల అధికారులతో రైతులు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ జిల్లాలో 66 వేల సీసీఆర్సీ కార్డులు లక్ష్యం కాగా ఇప్పటి వరకూ 40 శాతం పూర్తి చేశారన్నారు. మిగిలినవి జగనన్న సురక్ష కార్యక్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. డ్రోన్ సాంకేతిక వినియోగాన్ని అభివృద్ధి పరచే దిశలో రైతులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సుమారు రూ.40 వేలకు పైగా ఖర్చు అయ్యే శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని, ఐదుగురు సభ్యులు కలిసి ముందుకు రావాలని, వారిలో ఒకరు కనీసం ఇంటర్ విద్యా అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో యూరియా, డీఏపీ తదితర ఎరువులు 58,536 మెట్రిక్ టన్నుల అవసరం కాగా, 19,424 మెట్రిక్ టన్నుల సిద్ధం చేసి, 8478 ఎంటీలు అమ్మకాలు చేసినట్టు తెలిపారు. ఖరీఫ్ సేకరణ కోసం సాగు నుంచి కొనుగోలు చేసే వరకు రైతులు నుంచి వచ్చిన సూచనలనీ పరిగణనలోకి తీసుకోవడం, రైతులకు అవసరమైన ఎరువులు ఆయా ఆర్బీకేల వద్ద సిద్ధం చేశామన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని, రైతు భరోసా నుంచి ఇన్పుట్ సబ్సిడీ వరకూ ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. కౌలు రైతులకు సహకార బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్ పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు పనిచేస్తోందని, డ్రోన్‌పై పరిజ్ఞానం ఉచితంగా అందిస్తున్న దృష్ట్యా మండల, ఆర్బీకే పరిధిలో గ్రూపు లను గుర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే తేజా, జి.జనార్దనరావు, ఆదర్శ రైతులు ఎం.నరసింహారావు, డి.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.నందకిషోర్, ఇతర వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదోడి ఆకలి తీర్చడమే గొప్ప సేవ

అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ప్రభుత్వాసుపత్రిలోని అన్నదానంలో వడ్డిస్తున్న జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్

కంబాలచెరువు: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని, పేదవారి ఆకలి తీర్చడమే గొప్పసేవ అని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద జిమ్ కిరణ్ అప్పికట్ల ఆధ్వర్యంలో జక్కంపూడి గణేష్ పేరిట అన్నదానం శనివారం నిర్వహించారు. దీనికి జక్కంపూడి రాజా, ఆయన సోదరుడు, యువజన విభాగ రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ హాజరై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ జిల్లాలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వస్తుంటారని, వారి కోసం అన్నదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సోమ, శుక్ర, శనివారాలలో అన్నదానం చేస్తుంటారని తెలిపారు. రోజుకు సుమారు 700 మందికి అన్నదానం చేసేలా కార్యాచరణ రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో మహేష్ నంద, పండు, హుస్సేన్, విజయ్, మణికంఠ, సుధా, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

26, 27న జిల్లా స్థాయి ఎంపికలు

ప్రకాశం నగర్/రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ కడపలో ఏపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించన్ను క్రీడా పాఠశాలలో నాలుగు, ఐదు తరగతుల్లో ప్రవేశానికి జిల్లా స్థాయిలో ఈ నెల 26, 27 తేదీల్లో ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు బీఎంఎం శేషగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో మండల హెడ్ క్వార్టర్స్‌లో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకూ ఆయా మండలాల ఎంపీడీవోల పర్యవేక్షణలో మండల స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేస్తారన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారు ఎంపీడీవోల సంతకంతో కూడిన దరఖాస్తులతో జిల్లా స్థాయి ఎంపికలకు హాజరుకావాలన్నారు. వారికి ఈనెల 26, 27 తేదీల్లో రాజమహేంద్రవరం బొమ్మూరులోని వైటీసీసెంటర్‌లో ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో ఎంపికలకు జరుగుతాయన్నారు. ఈ క్రీడల్లో ఎంపికైన వారు రాష్ట్రస్థాయికి వెళతారని బీఎంఎం శేషగిరి తెలిపారు. నాలుగో తరగతిలో చేరే క్రీడాకారులు 2014 ఆగస్టు ఒకటి నుంచి 2015 జూలై 31 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశం పొందే క్రీడాకారులు 2013 ఆగస్టు ఒకటి నుంచి 2014 జూలై 31వతేదీ మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ప్రస్తుత పాఠశాల స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్‌ఫొటోలు రెండు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఇతర వివరముల కొరకు 8639774430,9032934038 ఫోన్‌నెంబరులలో సంప్రదించాలన్నారు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

పోలీసు మెడికల్ క్యాంప్‌లో జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి



పోలీసు హెల్త్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పోలీసు సిబ్బంది అంతా తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ప్రాణాలను కూడా పణంగా పెట్టి ప్రజలకు సేవ చేసే ఉద్యోగం పోలీసు ఉద్యోగమని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జాంపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ఏసీవై రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఎక్స్‌పర్ట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు శనివారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. దీనిని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సమర్థవంతంగా నిర్వహించగలమన్నారు. శిబిరంలో 94 మందికి వైద్య సేవలందించారు. మెగా మెడికల్ క్యాంపును పర్యవేక్షించిన అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ పంకజ్ కుమార్ మీనా, అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఆర్ ఐలు, యస్ఐలు, ఆర్ ఎస్.ఐ.లు, ఇతర అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న నాట్య కళాకారులు

నృత్యోత్సాహం

- అరంగేట్రంతో అదరగొట్టిన 'సిరి చందన'
- మూడో రోజు నృత్య పోటీల్లో పాల్గొన్న 310 మంది

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కళా సమ్మేళనం 2023లో భాగంగా రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జరుగుతున్న జాతీయ సంగీత, నృత్య పోటీలు మూడో రోజు కొనసాగాయి. నగరపాలక సంస్థ, శ్రీరాధాకృష్ణ ట్రస్టు, శ్రీరాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో శనివారం 310 మంది కళాకారులు పాల్గొన్నారు. 30 గ్రూపులు, 146 మంది సోలోలో తమ ప్రతిభను చాటారు. ఆఖరి రోజు ఆదివారం విజేతల వివరాలను ప్రకటిస్తారు. వీరికి ముఖ్య అతిథులు చేతుల మీదుగా మెడల్స్ ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతులుగా పోతిన శ్రీనివాస్, కుశల్ భట్టాచార్య, తాళ్ళపాక సందీప్ తదితరులు వ్యవహరించారు.



అరంగేట్రం చేసిన సిరి చందన

మొదటి ప్రదర్శన అద్భుతం

నాట్యాచారుల వద్ద నాట్యం నేర్చుకున్న తరువాత వారి మొదటి ప్రదర్శనను ప్రదర్శించి వారి నైపుణ్యాన్ని, ప్రతిభను చాటుకుంటారు. దీనినే అరంగేట్రం అని రంగప్రవేశం అని పిలుస్తారు. శనివారం జరిగిన అరంగేట్రంలో చెరుకుమల్లి సిరి చందన కూచిపూడి నృత్యంలో అరంగేట్రం చేసింది. ఏ మాత్రం భయం, బెరుకు లేకుండా సీనియర్స్‌లా చక్కని అభినయంతో ప్రేక్షలను సమ్మోహనం చేసింది. అనంతరం తను గురువు అయిన శ్రీరాధా కృష్ణ సంగీత నృత్య కళాక్షేత్ర గురు నాట్యాచారిణి గోరుగొంతు ఉమాజయశ్రీని సత్కరించారు.

కాపునాడు నగర అధ్యక్షుడిగా వీరబాబు

రాజమహేంద్రవరం సిటీ: కాపునాడు రాజమహేంద్రవరం అర్బన్‌కు నూతన కమిటీ నియమించినట్టు కాపునాడు రాజమహేంద్రవరం పార్లమెంటు అధ్యక్షుడు గుదే రఘునరేష్ తెలిపారు. గతంలో నియమించిన కమిటీ పదవీ కాలం రెండేళ్లు పూర్తయినందున మళ్లీ పునర్నియామకాలు చేసినట్టు తెలిపారు. స్థానిక దేవీచౌక్‌లోని కాపునాడు పార్లమెంటు కార్యాలయంలో శనివారం నూతన కమిటీకి నియామక పత్రాలు అందచేశామని రఘు నరేష్ తెలిపారు. అర్బన్ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా ముమ్మిడి వీరబాబు తదితర కార్యవర్గాన్ని నియమించినట్లు రఘు నరేష్ తెలిపారు.

అన్ని రంగాల్లో మాదిగల అభ్యున్నతే లక్ష్యం

'గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మేక్' జాతీయ నేతలు రత్నప్రభ, బాబూరావు



సెమినార్‌లో మాట్లాడుతున్న రత్నప్రభ తదితరులు

సీటీఆర్ఐ: విద్య, ఉద్యోగ, పారిశ్రామిక, రాజకీయ ఇలా అన్ని రంగాల్లో రాణించడానికి అవసరమైన ప్రోత్సాహం అందించడమే గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మేక్ ప్రధాన లక్ష్యమని గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మేక్ జాతీయ అధ్యక్షురాలు, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ కె.రత్నప్రభ అన్నారు. స్థానిక హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో 'గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మేక్' రాష్ట్ర సెమినార్ శనివారం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్నప్రభ మాట్లాడుతూ మాదిగ, మాంగ్, చామర్ ఉప కులాలకు(మేక్) చెందిన వాళ్ల దేశవ్యాప్తంగా చాలా చోట్ల వెనుకబడి ఉన్నారని, క్షేత్రస్థాయి నుంచి వారి అభ్యున్నతి కోసం కృషి చేయడమే 'గ్లోబల్ ఇన్‌ఫార్మ్ మేక్' ముఖ్య ఉద్దేశమన్నారు. మూడు నెలల క్రితమే జాతీయ స్థాయిలో ఈ సంస్థ ఏర్పడిందని, ఇటీవల వరంగల్ సమావేశంతో తెలంగాణ చాప్టర్, ఇప్పుడు రాజమహేంద్రవరం సదస్సు ద్వారా ఏపీ చాప్టర్ పని చేయడం మొదలైందని ఆమె వివరించారు. కింది స్థాయిలో చదువు కోడానికి , పెద్ద పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడడానికి, పరిశ్రమలు పెట్టుకోడానికి బ్యాంకు లోన్లు మంజూరుకు ఇలా అన్ని రకాలుగా ప్రోత్సహించి పైకి తీసుకురావాలని ప్రణాళిక వేస్తున్నామన్నారు. రాజకీయంగా కూడా తమకు ప్రాధాన్యత కావాలన్నారు. ఏపీ చాప్టర్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్పీ రాజ శిఖామణి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సదస్సులో తీసుకున్న నిర్ణయాలను జిల్లాస్థాయికి అక్కడ నుంచి క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, చైతన్య పరుస్తామన్నారు. ఈ సదస్సులో జాతీయ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ అడిషనల్ డీజీపీ కూచిపూడి బాబూరావు, ఏపీ ఫార్మర్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఎ.విద్యాసాగర్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

కడియం: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద శనివారం విశ్వబ్రాహ్మణలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జీవో నెంబర్ 665 ద్వారా వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానాలకు నిత్య ధూపదీప నైవేద్యాలకు నెలకు రూ.5వేలు చొప్పున ఇవ్వనున్నట్టు సీఎం జగన్ ప్రకటనపై విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్, మంత్రి చెల్లుబోయిన వేణు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కన్వీనర్ ధవళేశ్వరపు రవిశంకర్, కడియం మండల సంఘం నాయకులు పాల్గొన్నారు.



సీయం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

రక్తదాన శిబిరం

మధురపూడి: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం అభినందనీయమని వికాస్ ఫార్మసీ కాలేజీ చైర్మన్ తన్నీరు చిన్న సుబ్బారావు అన్నారు. శనివారం కోరుకొండ మండలం విమానాశ్రయం సమీపంలోని వికాస్ ఫార్మసీ కాలేజీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జక్కంపూడి రామ్మోనరావు ఫౌండేషన్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని సబ్బారావు ప్రారంభించారు. వికాస్, గైట్ , వీజేఎస్ కాలేజీలకు చెందిన 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారన్నారు.